అగస్థ్య గుండం... అపరిశుభ్రం...

- దుర్గంధం వెదజల్లుతున్న చెన్నూరు పెద్ద చెరువు
- ఆదరణకు నోచుకోక చెరువు నీరు కలుషితం
- నెరవేరని నాయకుల హామీలు

7

సహాయక పరికరాల పంపిణీ

లక్షెట్టిపేట, ఫిబ్రవరీ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు వేదికలో ఈనెల 20వ తారీకు రోజున అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలు, సహాయక పరికరాలను అందజేయడం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ మారుతీ ప్రసాద్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటర్ ట్రైసైకిళ్లు, చేతికర్రలు, సంకల కర్రలు, వీల్ ఛైర్స్ మూడు చక్రాల సైకిళ్లు, అదే విధం గా చెవిటి మూగ వారికి చెవి వెనుకాల ధరించే వినికిడ యంత్రాలు, అంద దివ్యాంగులక స్మార్ట్‌కేన్, అందుల చేతికర్ర, అంద విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్స్, మానసిక దివ్యాంగులకు ఎంఎస్ఐఈడి కిట్స్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. బ్యాటరీ ఆపరేటర్ ట్రైసైకిల్ పొందుటకు 80శాతం వికలాంగులు(చేతులు బాగుండి కాళ్ల వికలాంగత్వం ఉన్నవారు), మిగిలినవి మొత్తం 40శాతం వికలాంగుత్వం ఉన్నవారకి మాత్రమే అందజేయడం జరుగుతుందని ఈఅవకాశం మున్సిపాలిటీలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

బీసీ జపం..



- జిల్లాలో జోరుగా చర్చ
- ఏకతాటిపైకి వచ్చేందుకు సన్నాహాలు
- పీసీసీ అధ్యక్షుడి ప్రకటనతో ఊపందుకున్న వాదం
- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ముందుకు!

మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మళ్లీ బీసీ వాదం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం అన్ని పార్టీలకు చెందిన ద్వితీయస్థాయి నాయకులు బీసీ జపం చేస్తున్నారు. రాష్ట్రంలో కులగణన సర్వే చేపట్టినప్పటి నుంచి బీసీల రాజ్యాధికార నినాదం మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రతీసారీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో తెరపైకి వచ్చే బీసీ నినాదం.....ఈ సారీ ముందుగానే అందరి నోళ్లలో నానుతోంది. దీనికి కారణం భవిష్యత్తులో బీసీ సీఎం అని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రకటించడమే. పీసీసీ చీఫ్ వ్యాఖ్యల నేపథ్యంలో బీసీ వాదం ప్రాధాన్యతను సంతరించుకోగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వాదం వినిపించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీజేపీ మినహా ఇతర ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులుగా ఇతర కులస్థులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగాను మొన్నటి వరకు వెలమ సామాజిక వర్గానికి చెందిన వెరబెల్లి రఘునాథ్ బాధ్యతలు నిర్వహించగా, ఇటీవల చెన్నూరుకు చెందిన బీసీ సామాజిక నేత వెంకటేశ్వర్‌గౌడ్ నియమితులయ్యారు. ఇదే క్రమంలో మిగతా పార్టీలు కూడా అవకాశం ఇవ్వాలనే డిమాండ్‌లు తెరపైకి వస్తున్నాయి.

ఏకతాటిపైకి వచ్చేందుకు సన్నాహాలు....

2018 అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచి జిల్లాలో బీసీ ప్రత్యేక నినాదం ఊపందుకుంది. అలాగే 2023 శాసనసభ ఎన్నికల్లోనూ బీసీ ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. చెన్నూరు, బెల్లంపల్లి నియోజక వర్గాలు ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు కాగా, మంచిర్యాల నియోజకవర్గం జనరల్ కేటగిరీకి కేటాయించారు. దీంతో మంచిర్యాల నుంచి ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తరుపున అగ్రకులాలకు చెందిన వారు బరిలో నిలిచారు. 2018 ఎన్నికల సమయంలో బీసీ నినాదం తెరపైకి రాగా నియోజకవర్గ వ్యాప్తంగా కలిసికట్టుగా పాదయాత్రలు కూడా నిర్వహించారు. ప్రత్యేక కమిటీలు వేసుకుని బీసీలకే మద్దతు ఇవ్వాలంటూ తీర్మాణాలు కూడా చేశారు. ప్రస్తుతం బీసీ వాదం మళ్లీ తెరపైకి రావడంతో ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులందరినీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం...!

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడ్డ కులాలకు చెందిన వారికే టిక్కెట్లు కేటాయించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేందుకు పావులు కదుపుతున్నారు. జిల్లాలోని జనాభా మొత్తంలో దాదాపు 70 శాతం బీసీ సామాజిక వర్గం విస్తరించి ఉంది. జనాభా ప్రాతిపదికన చూసినా బీసీ ఓటర్లే అధికంగా ఉండటంతో వచ్చే ఎన్నికల్లో ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులకే టికెట్ ఇచ్చేలా అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులపై ఒత్తిడి తెచ్చేందుకు..

మిగతా 7లో

గిరిజనుల గుడిసెల తొలగింపు

నిద్రిస్తున్న వారిని లేపి మరీ కూల్చివేత



జన్నారం కంపార్టుమెంట్‌లో గిరిజనుల గుడిసెలను తొలగిస్తున్న అటవీ అధికారులు

జన్నారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ పరిధిలో గల గడ్డం గూడ గ్రామ సమీపంలోని 308 కంపార్టు మెంట్ అటవీ ప్రాంతంలోని గిరిజనుల గుడిసె లను మంగళవారం తెల్లవారుజామున అటవీ శాఖ అధికారులు తొలగించారు. గుడిసెల్లో నిద్రిస్తున్న వారిని లేపి మరీ అధికారులు ఈ చర్యలకు పూనుకున్నారు. దీంతో కొన్నేళ్లుగా ఉంటున్న గిరిజనులు నిరాశ్రయులయ్యారు. గడ్డం గూడ గ్రామ సమీపంలోని 308 కంపార్టు మెంట్‌లో 2005 సంవత్సరం నుంచి 25 నుంచి 30 గిరిజన కుటుంబాలు చెట్లను తొలగించి గుడిసెలు వేసుకుని స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని భూములను సాగు చేసుకుంటున్నారు. వీరికి పట్టాలు లేకపోవడంతో అటవీ అధికారులు పలుమార్లు గుడిసెలను తొలగిం చాలని హెచ్చరించి పోలీసుల సహాయంతో గుడిసెలను తొలగించేందుకు యత్నించారు. మంగళవారం తెల్లవారుజామున అటవీ అధికారులు గుడిసెల్లో ఉన్న వారిని నిద్రలేపి గుడిసెలను కూల్చివేశారు. దీంతో గిరిజనులు భయాందోళనలకు గురయ్యారు. 20 ఏళ్లుగా ఇక్కడ నివసిస్తున్నామని, తామెక్కడకు పోవాలని ఎఫ్ఆర్‌వోలు సుష్మారావు, శ్రీనివాస్‌లను ప్రశ్నించారు. ఈ విషయంపై ఎఫ్ఆర్‌వోను వివరణ కోరగాపై అధికారుల ఆదేశాల మేరకు గుడిసెలను తొలగించినట్లు తెలిపారు.

లక్షెట్టిపేటలో వంద పడకల ఆసుపత్రి

పనులు పరిశీలించిన కలెక్టర్ కుమార్ దీపక్



లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణం పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

లక్షెట్టిపేట, ఫిబ్రవరీ 18(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 30పడకల ఆసుపత్రిని వందపడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళ వారం కలెక్టర్ భవనం పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు సామాజిక, ప్రాథమికఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని అందుకు గాను ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగా లక్షెట్టిపేట ఆసుపత్రిని 30పడకల నుంచి 100పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి అనేక వైద్య సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ప్రజల పట్ల వైద్య సిబ్బంది మర్యాదపూర్వకంగా మెదులు కోవాలని వాళ్లకు కావాల్సిన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా విధులు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో కావాల్సిన మందుల నిలువలు అందుబాటులో ఉంచాలని అంతే కాకుండా ఆసుపత్రిలో ప్రతీ వార్డు లో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. వైద్యులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పట్టణంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలను, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందించే అందించే భోజనం, వంటకాల వివరాలు తెలుసుకున్నారు. వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిపెట్టి చదివించాలన్నారు. అనంతరం ఎంఎల్‌సీ పోలింగ్ కేంద్రాలను, మున్సిపాలిటీలోని డంపుయార్డును పరిశీలించారు. తడి పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి డంపుయార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలాల జాతరను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

జైపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అధికారులు సమన్వయంతో వేలాల జాతరను విజయవంతం చేయాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. మహాశివరాత్రి వేలాల జాతర సందర్భంగా మంగళవారం ఎస్టీపీపీలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతర ప్రశాంతంగా జరిగేలా అధికారులు చూడాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్, వాటర్ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పార్కింగ్‌స్థలాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, ఎస్ఐ శ్రీధర్, ఎస్టీపీపీ అధికారులు తుకారాం, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం

తాండూర్ సీఐ కుమారస్వామి



మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

తాండూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని తాండూర్ సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. మంగళవారం మాదారం టౌన్‌షిప్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీలు నిర్వహించి ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేని 50 ద్విచక్రవాహనాలను, 10 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని, ప్రజలందరు పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చినా, అనుమానస్పదంగా కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపార సముదాయాలు, కాలనీల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాల ద్వారా భద్రత ఉంటుందని, నేరస్తులను, దొంగలను త్వరగా గుర్తించవచ్చని తెలిపారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్, మాదారం ఎస్ఐ సౌజన్య, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష తమలపాకులార్చన..



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నస్పూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలో విశ్వశాంతి మహా యాగ మహోత్సవంలో భాగంగా మంగళవారం శ్రీ సుబ్రమణ్య, హనుమత్ హోమాలు అంజనేయ స్వామి వారికి మన్యుసూక్త సంపుటితో లక్ష తమలపాకుల అర్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం గోపూజ, తులసీ పూజ, శ్రీ రుద్ర సహిత మృత్యుంజయ హోమాలు, రుద్రాభిషేకం, కుంకుమార్చన, విష్ణు సహస్ర నామ, లలిత సహస్ర నామ పారాయణాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. పెద్ద ఎత్తున భక్తుల తరలివచ్చి దేవత మూర్తులను దర్శించుకుంటున్నారు.

వైద్యాధికారులు సమయ పాలన పాటించాలి

డీఎంహెచ్‌వో హరీష్‌రావు



కేంద్ర బృందం సభ్యులతో డీఎంహెచ్‌వో, వైద్యాధికారులు

గర్మిళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వైద్యాధికారులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో హరీష్‌రావు అన్నారు. మంచిర్యాలలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ పీఆర్‌సీ పాపులేషన్ రీసర్చ్ సెంటర్ విశాఖపట్నం బృందం సభ్యులు పర్యటించారు. హమాలీవాడలోని బస్తీ దవాఖానాను సందర్శించారు. అదే విధంగా వీఐపీ కార్యక్రమంలో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ ప్లాగ్ సేవ్ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రాల ద్వారా అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో హరీష్‌రావు వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బృందం సభ్యులు నాలుగు రోజుల పాటు జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భీష్మ, డాక్టర్ హరి శ్చంద్రరెడ్డి, కోటేశ్వర్‌రావు, అనిత, కృపబాయి, అనిల్, సుధాకర్‌నాయక్, కేంద్ర ప్రభుత్వ సభ్యులు డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్, ప్రశాంతి, డీపీఎం విశ్వేశ్వర్‌రెడ్డి, కాంతారావు, సుమన్, ప్రవళిక, పద్మ, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

జైపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతంగా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు కోరారు. మంగళవారం మండలం లోని ముదిగుంట గ్రామపంచాయతీని సందర్శించారు. గ్రా మంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలిం చారు. తడి, పొడి చెత్త వేరుగా సేకరించాలన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. వసూలు చేసిన ఇంటి పన్నులను గ్రామపంచాయతీ సాధారణ నిధికి జమ చేయాలన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శి సురేష్ ఉన్నారు.

ఎస్కార్ట్ నుంచి పారిపోయిన వ్యక్తికి జైలు శిక్ష

బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ఎస్కార్ట్ నుంచి పారి పోయిన నిందితుడు నాయిని బాపు అనే వ్యక్తికి బెల్లంపల్లి కోర్టు మెజిస్ట్రేట్ ముకేష్ మంగళవారం ఒక ఏడాది జైలు శిక్ష విధించినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. 2024 అక్టోబర్ 16న నేరస్తుడు నాయిని బాపు ఇద్దరు పోలీసు ఎస్కార్ట్‌లు ఆసిఫాబాద్ సబ్ జైలు నుంచి బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టుకు తీసుకువచ్చారు. తిరిగి జైలుకు తీసుకువెళ్తున్న క్రమంలో నిందితుడు బాపు పోలీసు ఎస్కార్ట్‌ను నెట్టివేసి పారి పోయాడు. కేసు నమోదు చేసి చార్జీషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరు పర్చగా జడ్జి శిక్ష విధించినట్లు తెలిపారు.

చీటింగ్ కేసులో మూడేళ్లు..

కాసిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పల్లంగూడలో గత ఏడాది ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇప్పిస్తాననిమోసం చేసిన నాయిని బాపు అనే వ్యక్తికి బెల్లంపల్లి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముకేష్ మూడేళ్ల జైలు శిక్ష, రూ. 3 వేల జరిమానా విధించి నట్లు దేవాపూర్ ఎస్ఐ అంజనేయులు తెలిపారు. నెన్నెల మండలం కోనంపేటకు చెందిన నాయిని బాపు గత ఏడాది జూన్‌లో కాసిపేట మండలంలోని పల్లంగూడ, గోండుగూడలో ప్రజలకు ఆయుష్మాన్ బారత్ కార్డులు ఇస్తానని బయోమెట్రిక్ ద్వారా మోసానికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

ఆరోగ్య కేంద్రానికి పరికరం అందజేత

చెన్నూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వీఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు మంగళవారం అన్‌లాగ్ కాటరీ అనే పరికరాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణకు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకటనర్సయ్య రూ. 40 వేలు విలువ చేసే పరికరాన్ని ఉచితంగా అందజేశాడు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం...

- గురుకులాల్లో కొరవడిన భద్రత
- ఏడుగురు విద్యార్థులపై కేసు నమోదు
- విధుల నుంచి ప్రిన్సిపాల్ తొలగింపు



పట్టణంలోని గురుకుల పాఠశాలలో విచారణ చేపడుతున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

చెన్నూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో అధికారుల పర్యవేక్షణ కొట్టొచ్చినట్లు కినిపిస్తోంది. విద్యార్థిపై సహచరులే చేసిన దాడి ఘటన పట్టణంలో సంచలనానికి దారి తీసింది. పదవతరగతి విద్యార్థి మనోజ్ గౌడ్‌పై అదే తరగతికి చెందిన ఏడుగురు విద్యార్థులు దాడి చేయడంతో పాటు సంఘటనను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో ఈ ఘటన వెలుగు చూసింది. ఘటన బయట పడగానే తేరుకున్న అధికారులు వెంటనే చర్యలకు ఉపక్రమించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు ఏడుగురు విద్యార్థులను సైతం సోమవారమే సస్పెండ్ చేశారు. మరోవైపు ఘటన తెలిసిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఏసీపీని విచారణకు ఆదేశించడంతో పోలీసులు అర్ధరాత్రి ఏడుగురు విద్యార్థులపై కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉంటే ప్రిన్సిపల్ సస్పెండ్ ఎత్తివేయాలని విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. దీంతో ఆ శాఖ ఆర్‌సీవో శ్రీధర్ రంగంలోకి దిగి విద్యార్థులకు నచ్చ జెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. మంచిర్యాల జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన రాజ్‌కుమార్ అనే ఉపాధ్యాయుడికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు.

లోపాలు ఎన్నో...

గురుకుల పాఠశాలలో జరిగిన దాడి విద్యార్థుల అభద్రతాభావాన్ని కలుగజేస్తుంది. విద్యార్థిపై తోటి విద్యార్థులే దాడికి పాల్పడి దాడి ఘటనను ఫోన్‌లో రికార్డు చేసి వైరల్ చేశారంటే పాఠశాలలోని పర్యవేక్షణ డొల్లతనం బయట పడింది. పాఠశాలకు సరైన భద్రత లేకపోవడం, పాఠశాల జనావాసాల్లో ఉండడం, ప్రహరీ గోడ లేకపోవడం, సీసీకెమెరాలు పనిచేయకపోవడం లాంటి అంశాలు భద్రత వైఫల్యాలను ప్రశ్నిస్తున్నాయి. విద్యార్థులు కొందరు గ్రూపులుగా విడిపోయారని, రాత్రి అయ్యిందంటే ఎవరి అనుమతి లేకుండానే పట్టణంలో తిరుగుతున్నారని, కొందరు విద్యార్థులైతే మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యార్థిపై దాడి జరిగేంత వరకు కూడా ఈ అంశాలు ఎందుకు బయట పొక్కలేదనేది సమాధానం లేని ప్రశ్నలుగా మిగులుతున్నాయి.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం

గురుకుల పాఠశాలలో జరిగిన ఘటనలో బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థిపై దాడి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రిన్సిపాల్‌ను ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించడంతో గురుకులంలోని కొంత మంది సిబ్బంది, విద్యార్థులు రాత్రి రహదారిపై ఆందోళన చేయడంపై విచారణ చేపట్టారు. విద్యార్థులు ఎవరి ప్రోద్బలంతో ఆందోళన చేశారనే అంశంపై వివరాలు సేకరిస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఈ విసయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నా రు. విచారణ అనంతరం పూర్తినివేదికను కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సీఐ రవీందర్, ఎంఈవో రాధాకృష్ణ మూర్తి, గురుకుల ఆర్‌సీవో శ్రీధర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ ఉన్నారు.

● విద్యార్థుల భవిష్యత్ ఏంటి...

గురుకుల విద్యార్థుల మధ్య గొడవలు, అల్లర్లు జరుగుతుండడం, దాడి ఘటనలు బయట పడుతుండడంతో పాఠశాలలోని మిగితా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దాడి జరిగిన అంశంపై బయటకు పొక్కగానే సంబంధిత శాఖ అధికారులు ప్రిన్సిపాల్‌తో పాటు ఏడుగురు విద్యార్థులను సస్పెండ్ చేస్తూ చేతులు దులుపుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు కారణం ఏమిటి, గొడవలకు మూలం ఏమిటి, పాఠశాలలో ర్యాగింగ్ ఎందుకు జరుగుతోంది, దీని వెనక ఎవరున్నారనే దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. మరో నెల రోజుల్లో వార్షిక పరీక్షలు ఉండడం, ప్రస్తుతం విద్యార్థులు సస్పెన్షన్‌తో పాటు కేసు నమోదు కావడంతో వారి భవిష్యత్‌పై నీలి నీడ లు కమ్ముకున్నాయి. మరో వైపు వార్షిక పరీక్షల నేపథ్యంలో ఈ సంఘటన ప్రభావం ఇతర విద్యార్థులపైన పడే అవకాశం ఉందని విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

కుడ్మేత సుధాకర్, సిర్పూర్(యు) ఎంఈవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎంఈవో: పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం నిధుల ద్వారా వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. పనులను తరుచూ పర్యవేక్షిస్తూ నాణ్యతగా సకాలంలో పూర్తి చేసేలా ఆదేశాలు ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పదో తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను ఎలా సన్నద్ధం చేస్తున్నారు?

ఎంఈవో: పదో తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేస్తున్నాం. మండలంలో వంద శాతం ఫలితాలు సాధించేలా వారికి ప్రతి విషయంపై అవగాహన కలిగించేలా ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వస్తున్నాం. ప్రతీ రోజుస్లిప్ టెస్టులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఈవో: విద్యార్థులు పరీక్షల్లో భయాందోళనకు గురికాకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తు న్నాం. ప్రశాంతంగా పరీక్షలు రాసేలా నిపుణులతో సూచనలు చేయిస్తున్నాం. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- సిర్పూర్(యు), ఆంధ్రజ్యోతి

రాయితీ బియ్యం పక్కదారి

● మహారాష్ట్రకు తరలిస్తున్న అక్రమార్కులు ● కేసులు పెడుతున్నా మారని వైఖరి



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

బెజ్జూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాయితీ బియ్యం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. జిల్లాలోని పలు మండలాలు మహారాష్ట్రకు సరిహద్దున ఉండడంతో రాయితీ బియ్యం పెద్ద ఎత్తున సరిహద్దులు దాటుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లు ఖర్చు చేసి పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యం పక్కదారి పడుతున్నాయి. సేకరించిన బియ్యానికి కిలోకు రూ. 10వరకు కమీషన్ మిగులుతుండడంతో చాలా మంది దీన్ని లాభాసాటి వ్యాపారంగా ఎంచుకుంటున్నారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని నిత్యం మహారాష్ట్రకు తరలిస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. బియ్యానికి బదులు దుకాణాల్లోనే లబ్ధిదారులకు నగదు అందజేస్తున్నారు.

దీంతో రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేసిన అక్రమార్కులు యథేచ్ఛగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. రేషన్ దుకాణాల ద్వారా ఒక్కొక్కరికి 6కిలోల బియ్యం ఇస్తున్నారు. అక్కడే సుమారు 10 నుంచి 15 రూపాయలు చెల్లిస్తూ అక్ర మార్కులు బియ్యం తీసు కుంటున్నారు. దీనికి దుకాణాల్లోని సిబ్బంది సైతం సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొంత మంది దళారులు రాయితీ బియ్యాన్ని సేకరించేందుకు ఏజెంట్లను సైతం నియమించుకున్నారని చెబుతున్నారు. జిల్లాలో పలుమార్లు దాడుల్లో రాయితీ బియ్యం పట్టుబడుతున్నా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

పొరుగు రాష్ట్రం సరిహద్దులోని..

సిర్పూర్ నియోజకవర్గంలోని మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న బెజ్జూరు, కౌటాల, సిర్పూర్(టి), చింతలమానేపల్లి తదితర మండలాల్లో రాయితీ బియ్యం దందా జోరుగా కొనసాగుతోంది. ఆయా మండలాల్లో సేకరించిన రాయితీ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ కిలోకు రూ.10నుంచి 15వరకు కొనుగోలు చేస్తూ అక్కడ కిలోకు రూ.20నుంచి 25వరకు విక్రయిస్తున్నారని చెబుతున్నారు. కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాల సరిహద్దున గల ప్రాణహిత నదిపై గూడెం వద్ద వంతెన పూర్తి కావడంతో అక్రమార్కులకు ఇది రాచమార్గంగా మారింది. ప్రతి నిత్యం రాత్రి వేళ ల్లో ద్విచక్రవాహనాలు, వ్యాన్లు, ఆటోల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రకు తరలించి లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇక సిర్పూర్ వంటి మండలం నుంచి రైళ్ల ద్వారా బియ్యాన్ని అక్కడికి చేర్చుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు తరచూ దాడులు చేస్తున్నా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

ఇటీవల కాలంలో..

జిల్లాలో ఇటీవల కాలంలో అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన, తరలిస్తున్న రాయితీ బియ్యాన్ని పట్టుకుంటున్నారు. దర్యాప్తు మాత్రం పకడ్బందీగా చేపట్టి అక్కమార్కులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పట్టుబడిన వ్యక్తులు ఎక్కడి నుంచి వాటిని సేకరించారు. ఎన్ని నెలల నుంచి వ్యాపారం సాగుతోంది. తదితర అంశాలపై లోతుగా దర్యాప్తు జరగడం లేదు. దీంతో పట్టుబడిన వారిపై కేసులు నమోదైనా మళ్లీ ఇదే దందా సాగించడమో లేదంటే వారి ప్రతినిధులను ఈ వ్యాపారంలో దింపి వెనుక నుంచి నడిపించడం లాంటివి చేస్తున్నారని తెలుస్తోంది. ఇటీవల కాగజ్‌నగర్ పట్టణంలో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఇక బెజ్జూరు మండలంలో ఇటీవల రెండు, మూడు రోజుల వ్యవధిలో సుమారు 30క్వింటాళ్ల బియ్యం పట్టుబడింది. అయినా అక్రమార్కులు కొత్తదారులు వెతుక్కుంటూ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. అధికారులు రాయితీ బియ్యం అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అక్రమ రవాణాను అడ్డుకుంటాం..

ప్రవీణ్‌కుమార్, ఎస్సై, బెజ్జూరు



గ్రామాల్లో రాయితీ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. ప్రభుత్వం పేదలకు సరఫరా చేస్తున్న రాయితీ బియ్యం మహారాష్ట్రకు తరలిస్తూ పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. బియ్యం అక్రమంగా నిల్వ చేసినా తరలించినా తమకు సమాచారం అందిస్తే పట్టుకొని కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే మండలంలో పలుచోట్ల దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశాం.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ వెంటే ఓటర్లు

కాంగ్రెస్ అవినీతి, అరాచకాలు ప్రజలకు తెలుసు

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులు, టీచర్లు, పట్టభద్రులంతా బీజేపీ వెంటే ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్యకు మద్దతుగా ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 27న జరుగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం పట్టభద్రులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారని, మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వే షన్లు అని ప్రకటించి, అందులో 10 శాతం ముస్లింలను కలుపుతా మంటున్నరు...అది బీసీలకు అన్యాయం చేసినట్టుకాదా అని ప్రశ్నించారు. సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డితోపాటు సిర్పూర్, కామారెడ్డి ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్‌బాబు, వెంకట్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు ముల్కల్ల మల్లారెడ్డి, పెద్దపల్లి పురుషోత్తం, తులా ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని రాష్ట్ర ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని ఆర్‌పీ గార్డెన్‌లో మంగళవారంనిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని, దీంతో బెల్లంపల్లి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలోఅభివృద్ధి చేస్తానన్నారు. బెల్లంపల్లిలో ఐటీ హబ్ ఏర్పాటుకు కృషి చేయడంతో పాటు నియోజకవర్గంలోని తాండూర్, నెన్నెల మండలాల్లో జూనియర్ కళాశాలలు త్వరగా ప్రారంభిస్తామన్నారు. జాబ్ క్యాలెండర్ ద్వారా నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేను ఇతర పార్టీల నాయకులు ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, నియోజకవర్గంలోని ఏడు మండలాల నాయకులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్కడ వృథా... ఇక్కడ వ్యధ

● పది రోజులుగా తాగునీటి కోసం ప్రజల ఇబ్బందులు



అందవెల్లి పెద్దవాగు వంతెన వద్ద వృథాగా పోతున్న నీరు

దహెగాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలానికి తాగునీరు అందించే పెద్దవాగు వంతెన వద్ద నీరు వృథా అవుతోంది. అక్కడ మరమ్మతుల కోసం పైప్‌లైన్‌కు నీరు నిలిపివేయడంతో పది రోజులుగా తాగునీరు అందక మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచి పోవడంతో దహెగాం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మండలంలోని ప్రజలు వ్యవసాయ పంపు వద్ద, బోర్ల నుంచి బిందెలు, క్యాన్లతో నీటిని తెచ్చుకుంటున్నారు. ఒడ్డుగూడలో నీళ్ల కోసం వాటర్ ట్యాంకర్ వద్ద గ్రామస్థులు వేచి చూస్తున్నారు.



ఒడ్డుగూడలో నీళ్ల కోసం క్యాన్లు, బకెట్లు పెట్టిన గ్రామస్థులు

అత్యాచారయత్నం కేసులో ఒకరికి మూడేళ్లు జైలు శిక్ష

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండ లానికి చెందిన దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం చేసిన కామెర శంకర్ అనే వ్యక్తికి మూడేల్లు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం జిల్లా అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి యువరాజు తీర్పు ఇచ్చారు. కౌటాల సీఐ ముత్యం రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానేపల్లి మండలానికి చెందిన దివ్యాంగురాలిపై 2023 ఏప్రిల్ 18న అదే గ్రామానికి చెందిన కామెర శంకర్ అత్యాచారయత్నం చేశాడు. ఆమె కేకలు వేయడంతో నిందితుడు పారిపోయాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు ఏప్రిల్ 19న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశ పెట్టారు. విచారణ జరిపిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో శంకర్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.9 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ జీవీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన కోర్టు లైజనింగ్ అధికారి రాంసింగ్, ఏఎస్సై బాలాజీ, ఏఎస్సైలను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

జోగాపూర్ అడవిలో పెద్దపులి సంచారం



పెద్దపులి అడుగులను పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో సర్వేశ్వర్‌రావు

నెన్నెల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇన్నాళ్లు బెల్లంపల్లి, తాండూరు పరిసర ప్రాంతాల్లో సంచరించిన పెద్దపులి సోమవారం రాత్రి కుశ్నపల్లి రేంజీలోకి ప్రవేశించింది. రంగాపేట నర్సరీ వద్ద రోడ్డు దాటి జోగాపూర్ అడవిలో సంచరించినట్టు అధికారులు పాదముద్రలను గుర్తించారు. రాత్రంతా ఈ ప్రాంతంలో తిరిగిన పెద్దపులి మంగళవారం ఉదయం నీల్వాయి రేంజి లోని చిత్తాపూర్ కలి చెరువు ప్రాంతం నుంచి పొట్యాల వైపు వెళ్లినట్టు కుశ్నపల్లి రేంజి అధికారి దయాకర్ తెలిపారు. చెన్నూరు ఎఫ్‌డీవో సర్వేశ్వర్‌రావు, మంచిర్యాల, నీల్వాయి రేంజ్ అధికారులు రత్నాకర్, అప్పలకొండలు పర్యటించి పెద్దపులి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి సిబ్బందికి సలహాలు, సూచనలిచ్చారు. పశువుల కాపర్లు అటువైపు గా వెల్లకూడదని గ్రామాల్లో చాటింపు వేయించారు. పొలాలు, పత్తి చేలకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

బెజ్జూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న నరేందర్‌రెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 20 కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించే కార్యకర్తల సమావేశానికి మంత్రి సీతక్క పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రడ్డి హాజరవుతున్నందున పట్టభద్రులు, కాంగ్రెస్ శ్రేణులు దిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి అభ్యర్థి గెలుపు కోసం పాటుపడాలని చెప్పారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వివరించాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీవర్ధన్, ఓంప్రకాష్, పుష్పలత, విశ్వేశ్వర్, లింగయ్య, రాజన్న, సదాశివ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షీ టీం సేవలపై విద్యార్థినులకు అవగాహన

కెరమెరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో షీ టీం, భరోసా సెంటర్ల సేవలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో డయల్ 100, భరోసా సెంటర్ 8712670561, షీ టీం 8712670564, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థికి బీసీ సంఘాల మద్దతు



టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిమల్క కొమురయ్యకు మద్దతు తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మద్ధతు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబులు ప్రకటనలో మద్దతు ప్రకటించారు.

● భగత్‌నగర్, (ఆంధ్రజ్యోతి): దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ గుర్తింపు తీసుకు వచ్చారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో ఆయన మాట్లాడారు.



కాంట్రాక్టు కార్మికుల వేతనాలు చెల్లించాలి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్ణాపూర్‌లలో పని చేస్తున్న సులబ్ కార్మికులకు సంబంధించిన వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీ యూ అనుబంధ కార్మిక సంఘం బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు జాఫర్ డిమాండ్ చేశారు. స్థానికంగా మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కార్మికుల గైర్హాజరుతో ఉత్పత్తికి విఘాతం

కాసిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎక్కువ మంది కార్మికులకు విధులకు గైర్హాజరు కావడం వల్ల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని కాసిపేట 2వ గని మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం గని ఆవరణలో గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అండర్‌గ్రౌండ్ కార్మికులు నెలలో 16 కంటే తక్కువ, సర్ఫేస్‌ఉద్యోగులు 20 మస్టర్ల కంటే తక్కువ విదులు నిర్వహించడం వల్ల బొగ్గు ఉత్పత్తి తగ్గిపోయి సంస్థ మనుగడ దెబ్బతింటుందన్నారు. ప్రతి కార్మికుడు బాధ్యతగా విదులకుహాజరు కావాలని కోరారు. గైర్హాజరైతే కార్మికుల కుటుంబాలు కూడా ఆర్థిక ఇబ్బందులు పడతారని తెలిపారు. విదులు నిర్వహిస్తే ఆర్థికంగా బలం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి బార్గవ్, పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. ఏరియా వర్క్‌షాపులో మంగళవారం కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల సాధన కోసం తమ యూనియన్ పని చేస్తుందని అన్నారు. ఉత్పత్తి లక్ష్య సాధనకు కేవలం మరో 45 రోజుల సమయం ఉన్నందున యాజమాన్యం ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఉత్పత్తి, లక్ష్య సాధన దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన పనిముట్లు అందజేయాలని కోరారు. వర్క్‌షాపులో పని చేస్తున్న ట్రేడ్స్‌మెన్‌కు టూల్ కిట్స్ ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో బ్రాంచి ఉపాధ్యక్షులు బీమనాథుని సుదర్శన్, నాయకులు సోముశెట్టి రాజేషం, కంది శ్రీనివాస్, ఎగ్గేటి రాజేశ్వర్‌రావు, ఆంథోని దినేష్, వేణు, రాజేషం, తోట వెంకటస్వామి, రాజయ్య, వెంకట్రావ్, సదానందం, పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

నుమాయిష్‌లో ద్వితీయ బహుమతి



అభినందిస్తున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఏర్పాటు చేసిన 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో సింగరేణి సేవా సమితి ఏర్పాటు చేసిన మహిళా శక్తి మార్కెట్.. స్వయం ఉపాధి ఉత్పత్తుల స్టాల్‌కు ద్వితీయ బహుమతి లభించింది. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు బహుమతి ప్రదానం చేయగా, జీఎం(కోఆర్డినేషన్) సుభాని, పీఆర్‌ఓ, సేవా సమితి కోఆర్డినేటర్ అధికారి శ్రీకాంత్ అందుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ ఎన్ బలరాం మాట్లాడుతూ, సింగరేణి సేవా సమితి స్టాల్‌కు బహుమతి రావడం ఆనందదాయకమన్నారు. నుమాయిష్‌లో సింగరేణిలోని 10 ఏరియాలకు చెందిన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారని, రూ. ఆరు లక్షల విలువైన వస్తువులు విక్రయించాలని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పక్షాన పోరాటం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తున్నామని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు ఇచ్చిన సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. ఉప్పారపు వెంకటేశ్, రామకృష్ణ, ఇతరులకు గత కొన్నాళ్లుగా పదోన్నతులు రాలేదని, తమ సంఘం పక్షాన పోరాటం చేసి ఇప్పించామన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన సీఎండీ బలరాం, డైరెక్టర్లు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సహకారం అందించిన సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్ రావు, ముఖ్య సలహాదారు చిరంజీవులు, ఎస్‌సీ లైజన్ అధికారి కిరణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాజేశ్, లక్ష్మణ్, నర్సింగరావు, శంకర్, మురళి, యుగేందర్ సాయి, మహేందర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ..



చెన్నూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సుచిర్ ఇండియా ఫౌం డేషన్ వారు నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో చెన్నూరు పట్టణంలోని న్యూలయోల, రైజింగ్‌సన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి అవార్డులు పొందినట్లు సంస్థ కో ఆర్డినేటర్ పుప్పాల ప్రవీణ్ తెలిపారు. నాంపల్లి తెలుగు లలిత కళాతోరణంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో విద్యార్థులకు అవార్డులు అందించారు.

బోనమో'..

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ బోనాలను మంగళవారం నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా ఆలయం వరకు చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గౌడ సంఘం నాయకులు కంబగోని సుదర్శన్‌గౌడ్, భూమయ్యగౌడ్, మహిళలు ఉన్నారు.



బోధన..



దండేపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రానున్నది డిజిటల్ కాలమేనని ప్రతి ఉపాధ్యాయుడు డిజిటల్ బోధనపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో దుర్గం చిన్నయ్య అన్నారు. మంగళవార దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో డిజిటల్ తరగతుల విద్యాబోధనపై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.

స్వాగత సత్కారం ..

జైపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి) : మంచిర్యాల జిల్లా పర్యటనకు వస్తున్న బీజేపీ కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మంగళవారం మండలంలోని ఇందారం బస్టాండ్ వద్ద బీజేపీ కార్యకర్తలు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో బండి సంజయ్ కాసేపు ముచ్చటించారు.



అగస్త్య గుండం అపరిశుభ్రం

- దుర్గంధం వెదజల్లుతున్న చెన్నూరు పెద్ద చెరువు
- ఆదరణకు నోచుకోక చెరువు నీరు కలుషితం
- నెరవేరని నాయకుల హామీలు



చెరువు మధ్యలో ప్రతిష్ఠాపనకు నోచుకోని శివలింగం



చెరువులో చేరిన చెత్త

చెన్నూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అగస్త్య మహర్షి తవ్వించిన గుండం ఆదరణకు నోచుకోవడం లేదు. పూర్వకాలంలో అగస్త్యమహాముని ఈ ప్రాంతంలో తపస్సు చేసి చెన్నూరు నడిఒడ్డున శివలింగాన్ని ప్ర తిష్ఠించగా అది ఇప్పుడు అగస్త్వేరాలయంగా పిలు వబ డుతోంది. పూర్వకాలంలో ఎందరో మునులు పుణ్య స్నా నాలు ఆచరించడంతో పాటు పట్టణ వాసులు సైతం దీనిని పవిత్ర గుండంగా భావించేవారు. నాడు తాగు నీరు అందించిన ఈ చెరువు నేడు దుర్గంధానికి నిలయంగా మారింది. చెన్నూరు సమీపంలోని వ్యాపార సముదాయాలు, కుటుంబాలు చెత్తా, చెదారం చెరువు లో వేస్తుండడంతో రోజు రోజుకూ పెంట కుప్పలా త యారవుతోంది. సమీపంలో ఎక్కడ డంపింగ్‌యార్డులే కపోవడంతో పట్టణ వాసులు, చికెన్ సెంటర్ నిర్వా హకులు, హెయిర్ సెలూన్ వారు చెత్తను, ప్లాస్టిక్ సంచులు, డబ్బాలు, కొబ్బరి బోండాలు, సర్జికల్ సామగ్రి, ఇతర నిరుపయోగమైన వస్తువులు ఈ చెరువులో పడే యడంతో అపరిశుభ్రంగా మారడంతో పాటు చెరువులోని నీరంతా కలుషితం అవుతోంది.

ఈ చెత్తా చెదారంలో పందులు, దోమలు వ్యాప్తి చెంది ఆవాసం ఏర్పర్చుకోవడంతో సమీపంలోని ప్రజలకు వ్యాధులు సోకుతున్నాయి. మరో వైపు నీళ్లల్లో నివసిస్తున్న జీవరాశుల ఉనికికి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. నాడు అగస్త్య గుండంలో స్నానం చేస్తే ఎంతో పుణ్యమని భావించే పట్టణ వాసులు నేడు చెరువు సమీపంలోకి వెళ్లేందుకు జంకుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పాలకులు పట్టించుకుని చరిత్ర ఉన్న పెద్ద చెరువును శుభ్రం చేయించి సమీపంలో చెత్తా, చెదారం వేయకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిలిచిన పనులు

20 ఏళ్ల క్రితం మాజీ ఎంపీపీ స్వర్గీయ షైదం సత్య నారాయణ ఈ చెరువును పునరుద్ధరించేందుకు కృషి చేసినా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకుని చెరువులో శివలింగాన్ని నిర్మించారు. తవ్వకా ల్లో పలు రాత్రి విగ్రహాలు బయట పడగా పునః ప్రతిష్ఠించేందుకు నిర్ణయించారు.

నెరవేరని మంత్రి హామీ

గోదావరి ఆది పుష్కరాల సమయంలో ఈ ప్రాంతా నికి వచ్చిన అప్పటి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి అసంపూర్తి పనుల విషయం తీసుకువె ళ్లగా అభివృద్ధికి మంత్రి హామీ ఇచ్చినా నేటికి నెరవేరలేదు. అగస్త్య గుండం నిర్మాణంలో ఆగి ఉన్న శివలింగం ప్రతిష్ఠాపన పనులకు కోటి రూపాయల నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పట్టణ ప్రజలు, బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. కానీ ఏళ్లు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా మంజూ రు కాకపోగా మంత్రి మాట నీటి మూటగానే మిగిలి పోయింది. ఇప్పటికైనా ఈ ప్రాంత పాలకులు స్పందించి శివలింగం ప్రతిష్ఠాపనతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు నత్తనడకన

చెన్నూరు పెద్ద చెరువు అభివృద్ధి కోసం అప్పటి బీ ఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చెన్నూరు మున్సిపాలిటీ డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ. 7 కోట్లు మంజూర య్యాయి. చెరువు అభివృద్ధితో పాటు చెరువు కట్టపై రహదారి తదితర అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్పటికీ అవి నత్తనడకన సాగగా నేటికి పూర్తి కాలేదు. చెరువు కట్టపై దాదాపు 2 కిలో మీటర్ల బీటీ రహదారి నిర్మించాల్సి ఉన్నా నిర్మించలేదు. రహదారికి ఇరువైపులా మొక్కలు నాటినా పర్యవేక్షణ లోపంతో ఎండిపోతున్నాయి.

రూ. 50 లక్షలు వృథా

చెరువు అభివృద్ధితో పాటు కట్టపై, కట్ట కింద ప్రాంతంలో సుందరీకరణ అభివృద్ధి కోసం రూ. 50 లక్షలు వెచ్చించినా అవి వృధా అయ్యాయి. కట్టపై పూల మొక్కలు, కట్ట కింద ప్రాంతంలో లాన్‌ను ఏర్పాటు చేసిన ప్పటికీ సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో లాన్ (గడ్డి) మొత్తం ఎండిపోయింది. దానికి అమర్చిన డ్రిప్ మొత్తం వృథాగా ఉండడంతో వాటిని దొంగలు ఎత్తుకెళ్లిపోతున్నారు.

గుండానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది

హిమాకర్ శర్మ, శివాలయం ప్రధాన అర్చకులు



పెద్ద చెరువుగా పిలవబడుతున్న అగస్త్య గుండానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. ఈ గుండంలో నాడు పుణ్య స్నానాలు ఆచరించ డంతో పాటు పట్టణ ప్రజలందరు ఇక్కడి నీరే తాగేవారు. ఎన్నో జీవరాశులు, ఎన్నో రకా లైన ఆయుర్వేద మొక్కలు ఉండేవి. ఈ గుండం నీటి తోనే శివునికి జలాభిషేకం జరిగేది. నేడు ఈ చెరువు చె త్తా, చెదారంతో అపరిశుభ్రంగా మారింది. దీన్ని ప్ర భుత్వం పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పంట దిగుబడిపై ప్రభావం

మణికరౌత్ హన్మంతు, ఆయకట్టు రైతు



పెద్ద చెరువు చెత్తా, చెదారం నిండి నీరు కలుషితం కావడంతోఈ నీరు పంటల ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. చెరువు కింద సాగవుతున్న పంటలు కలుషిత నీటి వల్ల పూర్తిస్థాయిలో ఎదగక దిగుబడి రావడం లేదు. పైగా అగస్త్య మహర్షి ఏర్పాటు చేసిన పవిత్ర గుండం కలుషితం కావడం దురదృష్టకరం.

లక్షల నిధులు వృథా..:

గుండేటి మధుకర్, పట్టణ వాసి



పట్టణంలోని పెద్ద చెరువు అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు వెచ్చించినా అధికారుల అలసత్వం, నాయకుల నిర్లక్ష్యం వల్ల ప్రజాధనం వృథా అయ్యింది. ఇ ప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పం దించి చెరువు కట్టపై సుందరీకరణ పనులు చేపట్టాలి. ఎంతో ప్రాశస్త్యం అగస్త్య గుండం అభివృద్ధికి తోడ్పడాలి. చెన్నూర్ ప్రజలకు ఆహ్లాదం కోసం ఇక్కడ ఒక్క ప్రదేశం కూడా లేదు. కనీసం దీనిపై దృష్టి పెట్టి సుందరీకరణ పనులు చేస్తే సాయంత్రం సమయంలో స్థానికులు సేద తీరేందుకు దోహదపడుతుంది.





చెత్తతో నిండిపోయిన పెద్ద చెరువు, ధ్వంసమైన డ్రిప్ పైపులు

బీసీ జపం..

(5వ పేజీ తరువాయి)

సమాలోచనలు జరుగుతున్నాయి. అన్ని ప్రధాన పార్టీల్లో ఉన్నత పదవుల అలంకరణకు అర్హతలున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలు అనేక మంది ఉన్నారు. ఇప్పుడిప్పుడే తమ పేర్లు తెరపైకి వస్తే పార్టీల నుంచి స్పందన వేరేలా ఉంటుందన్న భావనలో మిన్నకుండిపోతున్నారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్న నిర్ణయానికి వచ్చినందున స్థానిక సంస్థల్లో ఎలాగూ తమ సామాజిక వర్గానికే టికెట్లు కేటాయిస్తారనే నమ్మకంతో ఉన్నారు.

పీసీసీ చీఫ్ ప్రకటనను స్వాగతిస్తున్నాం...

బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్

బీసీలకు సీఎం పదవి ఇస్తున్నట్లు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. బీసీ ఉద్యమ ఫలితంగానే ఈ రోజు కాంగ్రెస్ పార్టీ స్పందించింది. అలాగే మిగతా పార్టీలు కూడా స్పందించాల్సిన అవసరం ఉంది. అయితే పీసీసీ చీఫ్ కేవలం స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రకటన చేస్తేమాత్రం బీసీలు తగిన గుణపాఠం చెప్తారు. బీసీని సీఎం చేసి ఆ సామాజిక వర్గాలకు రాజ్యాధికారం అందిస్తే కాంగ్రెస్ పార్టీని యావత్ బీసీ సమాజం అక్కున చేర్చుకుంటుంది.

ఐఎఫ్ ప్యానల్లతో విద్యార్థులకు బోధించాలి

జైపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానళ్లతో విద్యార్థులకు బోధించాలని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఫిజికల్స్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల దృష్ట్యా విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రీసోర్స్ పర్సన్‌లు రామకృష్ణ, ప్రసాద్‌రావు, విగ్నేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని చెన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని సారంగపల్లి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న పథకాలపై అవగాహన పెంచుకోవాలని తద్వారా రైతులకు లాభం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి కళ్యాణి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ అధికారి రాజేష్, ఏఈవో ముత్యం తిరుపతి, పంచాయతీ కార్యదర్శి నవ్య, రైతులు కమల్ మనోహర్, ఫిరోజ్ పాల్గొన్నారు.

టైగర్ జోన్‌లోకి కొన్ని మండలాల వాహనాలకే అనుమతులు

జన్నారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్‌లోని కోర్‌ఏరియా అటవీ ప్రాంతంలో గల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దండేపల్లి, జన్నారం, దస్తూరాబాద్, కడెం, ఉట్నూరు మండలాల వాహనదారులకు అనుమతులు ఇస్తూ ఎఫ్‌టీబీటీ శాంతారాం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మండలాలకు చెందిన ప్రజల వాహనాలకు ఎలాంటి అభ్యంతరాలు తెలపకుండా అనుమతించడమే కాకుండా పర్యావరణ రుసుము నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు వినతి పత్రం

చెన్నూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలోని 863 సర్వే నెంబరు లోని జర్నలిస్టులకు కేటాయించిన భూమిని కాపాడాలని మంగళవారం తహసీల్దార్ మల్లికార్జున్‌కు పట్టణ జర్నలిస్టులు వినతి పత్రం సమర్పించారు. గతంలో 863 సర్వే నెంబరులోని రెండెకరాల 20 గుంటల భూమిని జర్నలిస్టులకు కేటాయించగా ఆ భూమిని కొంత మంది బడానాయకుల అండదండలతో భూకబ్జాదారులు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మంగళవారం బూకబ్జదారులు ఏకంగా భూమిలో సిమెంటు పోల్స్ వేశారని, అక్రమంగా ప్రభుత్వ భూమిలో సిమెంటు పోల్స్ వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అట్టెం మధునయ్య, పోచిరెడ్డి, కళ్యాణ్, ఎల్లాగౌడ్, శ్రీహరి, కరుణాకర్, కిరణ్, సంతోష్, తౌసిక్, ఇమ్రాన్, రాజేందర్ పాల్గొన్నారు.

చలో హైద్రాబాద్ పోస్టర్ల విడుదల

బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టిన ఛలో హైద్రాబాద్ పోస్టర్లను మంగళవారం బెల్లంపల్లిలో ఐఎఫ్‌టీయూ నాయకులు విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్, నాయకులు రత్నం తిరుపతి, వెంకటి, శ్రీనివాస్, భూమయ్య, కృష్ణవేణి, బాను పాల్గొన్నారు.

కార్యదర్శుల ఫోరం కార్యవర్గం ఎన్నిక

నెన్నెల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతి కార్యదర్శుల ఫోరం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీవో శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండల అధ్యక్షులుగా సీహెచ్ సతీష్‌కుమార్, కార్యదర్శిగా కె. సురేష్, గౌరవ అధ్యక్షులుగా పద్మనాభం, ఉపాధ్యక్షులుగా రంజిత్‌కుమార్, సరిత, కోశాధికారిగా లక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా మధుసూధన్, స్రవంతి, ప్రచార కార్యదర్శిగా వేణుగోపాల్, సంస్కృతిక కార్యదర్శిగా సి. శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ప్రశాంత్, రాజలింగు, వనితరాణి పాల్గొన్నారు.

ఘనంగా దక్కన్ పూలే భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : బడుగుల బాంధవుడు, విద్యా ప్రధాత దక్కన్ పూలే భాగ్యరెడ్డివర్మ వర్ధంతిని డీహెచ్‌పీఎస్ నాయకులు మంచిర్యాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం నిర్మూలన, విద్యావ్యాప్తికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దేవి పోచన్న పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

గర్మిళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ సీనియర్ లైన్ మెంబర్ సత్తిరెడ్డి కుమార్తె రోహిణి-సాయివిశాల్‌రెడ్డి మొదటి వివాహ వార్షికోత్సవం సందర్భంగా తలసేమియా సికిల్ సెల్ చిన్నారులకు మందుల నిమిత్తం మంగళవారం రూ. 5 వేలను రక్తనిధి కేంద్రంలో అందజేశారు. ఆర్థిక సహాయం చేసిన వారిని రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జీ మధుసూదన్‌రెడ్డి అభినందించారు.

ఇస్కాన్ లోగోతో రియల్ ఎస్టేట్ వ్యాపారం

సంస్థ మేనేజర్‌పై కేసు నమోదు

భీమారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రంలోని హైవే రోడ్డుకు మామిడి తోటను తీసుకుని సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ రియల్ ఎస్టేట్ సంస్థ వారు ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ అయిన ఇస్కాన్ పేరుతో ఉన్న లోగోను వాడుకుని ప్రజలను మోసం చేస్తున్నారని సంస్థ జనరల్ మేనేజర్ హనుమాన్ విజయ దాసా ఫిర్యాదుమేరకు సిస్కో ఇన్‌ఫ్రాడెవ లపర్స్ ఎల్‌ఎల్‌పీ పలాస చంద్ర దాసపైన కేసు నమోదు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం భీమారం పోలీస్‌స్టేషన్‌లో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, భీమారం ఎస్‌ఐ శ్వేతతో కలిసి సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ అబద్ధపు ప్రకటనలు నమ్మవద్దన్నారు. ఇప్పటికే సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ రియల్ ఎస్టేట్ మీద పెట్టుబడి పెట్టిన వారు లీగల్‌గా సపోర్టు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఒకవేళ ఏదైనా అనివార్య కారణాల వల్ల ఇబ్బం దులు పెడితే ప్రజలకు అండగా న్యాయ వ్యవస్థ ఉందని పేర్కొన్నారు. దీనిపై విచారణచేపడతామని పేర్కొ న్నారు. స్థలాలు కొనేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు వహించాలని, సరైన పత్రాలు ఉన్నాయా ఉంటే అవి నిజమైనవేనా అని నిర్ధారించుకోవాలన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

మాదిగ హక్కుల దండోరా అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మాదిగ హక్కుల దండోరా అధ్యక్షుడిగా మందమర్రి పట్టణం రెండో జోన్‌కు చెందిన కొలగూరి విజయ్ కుమార్ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను నియమిస్తూ మంగళవారం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనర్సు మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గయ్య మాదిగలు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేదర్ పార్కును పునఃప్రారంభించాలని విజయ్ కుమార్ పోరాడుతున్నాడని అన్నారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. లెదర్ పార్కు ప్రారంభించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఆకునూరి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపట్టిన ఛలో హైద్రాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. మంగళవారం క్యాతనపల్లిలో అరుణోదయ కళాకారులతో ర్యాలీ నిర్వహించారు. నాయకులు మా ట్లాడుతూ ఛలోహైద్రాబాద్‌లో అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లన్న, అరుణ, జ్యోతి,వెంకటేష్, పాల్గొన్నారు.

హైద్రాబాద్‌కు తరలి వెళ్లిన ఆర్‌ఎంపీ వైద్యులు

చెన్నూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌లో అనుభవ వైద్యుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మగౌరవ సభకు చెన్నూరు పట్టణం, మండలంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు మం గళవారం హైద్రాబాద్‌కు తరలివెళ్లారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైద్రాబాద్ ధర్నా చౌక్‌లో నిర్వహించిన మహాసభకు తరలి వెళ్లినట్లు ఆర్‌ఎంపీ వైద్యులు పేర్కొన్నారు. వెళ్లిన వారి లో ఆర్‌ఎంపీ వైద్యులు లక్ష్మణ్, కృష్ణశ్రీనివాస్, కృష్ణమూర్తి, పృథ్వీరాజ్, వెంకటేష్, సమ్మిరెడ్డితో పాటు 100 మంది వెళ్లారు.

దండేపల్లి: చలో హైదరాబాద్ గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభకు దండేపల్లి మండలం నుంచి ఆర్‌ఎంపీ, పిఎంపిలు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

జన్నారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన ఉట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. మంగళవారం జన్నారంలోని ఆర్‌ఆర్‌ఎస్‌మిని ఫంక్షన్‌హాలులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నాయకులు పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రచారం చేయాలన్నారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ సయ్యద్ ఫసివుల్లా, నాయకులు రాజశేఖర్, మోహన్‌రెడ్డి, ఇసాక్, శంకరయ్య, రియాజుద్దీన్, సతీష్, ఇందయ్య, రమేష్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

సంక్షిప్త సమాచారం

భీమారం : రైతులు పశువుల పాకలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మధుసూదన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పోలంపల్లి గ్రామంలో నక్క రమేష్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మించుకున్న పశువుల పాకను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో జీనత్, పంచాయతీ కార్యదర్శి సృజన, ఈసీ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజన్న పాల్గొన్నారు.

జన్నారం : ఫైలేరియా (బోధకాలు) వ్యాధి నివారణలో భాగంగా సోమవారం రాత్రి జన్నారం మండలంలోని తపాలపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రజలకు ఫైలేరియా నివారణపై అవగాహన కల్పించారు.

బెల్లంపల్లిరూరల్ : మండలంలోని కన్నాల బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం నిర్వహించిన దుకాణాల వేలం పాట వాయిదా వేసినట్లు ఆలయ ఈవో బాపురెడ్డి తెలిపారు. గత ఏడాది కంటే వేలం ఇప్పుడు తక్కువ వచ్చినందుకు వేలం పాట వాయిదా వేశామని, శుక్రవారం ఉంటుందన్నారు.

భీమారం : మండలంలోని పోతనపల్లి ఎంపీపీఎస్, నర్సింగాపూర్‌లోని జిల్లాపరిషత్ పాఠశాలను డీఈవో సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

తాండూర్ : మండలంలోని అచ్చలాపూర్ గ్రామ శివారులో మంగళవారం ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో ట్రాక్టర్ డ్రైవర్ భీమినికి చెందిన బోర శ్రీనివాస్ గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జన్నారం : విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి పరీక్షలు రాయాలని ప్రముఖ సైకాల జిస్టు, మోటివేషనల్ స్పీకర్ బనావత్ ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం జన్నారం ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రెబ్బెన, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని ముందుకెళ్లాలని జీఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శాప్‌ఫైల్ లైఫ్ సైకిల్‌పై మంగళవారం అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ నుంచి సింగరేణి వ్యాప్తంగా పేపర్ లెస్ ప్రక్రియ అమలు కానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం కె.రాజమల్లు, పీఓ ఎం.నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఐటీ ఇన్‌చార్జి ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై దృష్టి సారించాలి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో నీటి సమస్య రాకుండా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఇతర ముఖ్య కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సాగునీరు, తాగునీరు, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా, రైతు భరోసా, యాసంగి సీజన్‌కు సాగునీటి సరఫరా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ వచ్చే వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యాచరణ రూపొందించాలన్నారు. యాసంగి సీజన్‌లో సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని సూచించారు. వేసవి కాలంలో వ్యవసాయానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకూ రైతుభరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారందరికీ జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకుల ప్రాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు డీపీవో భిక్షపతి గౌడ్, జిల్లా విద్యుత్‌శాఖాధికారి శేషారావు, వ్యవసాయ, నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు మార్చి 8న జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు భవనంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యలు, వివాహం, కుటుంబ సమస్యలు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ ఇతర అన్ని రకాల కేసులను ఇరు పార్టీల మధ్య రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. లోక్‌అదాలత్ కేసుల పరిష్కారంతో ఆర్థికంగా కూడా లాభం జరుగుతుందని తెలిపారు.



ఈ చిత్రంలో ఉన్న రైతు సొంగ్గె దాదాజీ. చీలాటిగూడ గ్రామం. గత మంగళవారం 22 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి సీసీఐ కేంద్రానికి తీసుకొచ్చాడు. అప్పటి నుంచి నెట్‌వర్క్ లేక పోవడంతో పత్తి కొనుగోలు చేయలేదు. ఇప్పటికే వారం రోజులు గడిచింది. నష్టపోయినా దళారు లకు అమ్ముకోక తప్పని పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నాడు.



ఈ రైతు పిడుగు శంకర్, రహపల్లి గ్రామస్థుడు. 26 క్వింటాళ్ల పత్తి అమ్మడానికి 10 రోజుల క్రితం ఆసిఫాబాద్ సీసీఐ కేంద్రానికి తీసుకొచ్చాడు. ట్రాక్టర్ అద్దె రోజుకు రూ.1000 చెల్లిస్తు న్నాడు. నెట్‌వర్క్ లేక పోవడంతో అధికారులు పత్తి కొనుగోలు చేయలేదు. ఇప్పటికే రూ. 10,000 అద్దె కట్టాల్సి వచ్చిందని ఆవేదన చెందుతున్నాడు.

సిగ్నల్ సమస్యలు.. పత్తి అమ్మకానికి పడిగాపులు



ఆసిఫాబాద్‌లో జిన్నింగ్ మిల్లు వద్ద నిలిచిన పత్తి వాహనాలు

- పది రోజులుగా రైతుల అవస్థలు
- వాహనాల అద్దె భారంగా మారిందని అన్నదాతల ఆవేదన

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సిగ్నల్ సమస్యలతో పది రోజులుగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా జిన్నింగు మిల్లుల వద్ద పత్తి లోడుతో వచ్చిన వాహనాలు, బండ్లు నిలిచిపో యాయి. అందుకు ముందు నాలుగు రోజులు సైతం మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోయా యని సీసీఐ పత్తి కొనుగోళ్లను నిలిపివేసింది. రేపో మాపో పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయనే ఆశతో అన్నదాతలు పడిగాపులు పడుతు న్నారు. వాహనాలకు నిత్యం రూ. వేలల్లో అద్దె చెల్లించాల్సి వస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పరిస్థితి గమనించిన రైతులు అద్దె భారమైన ఇతర జిల్లాలు, మహారాష్ట్రకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

● దళారులకు వరం..

సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడం దళా రులకు వరంగా మారింది. అత్యవసరమైన రైతు లు కేంద్రాలను తరలించిన పత్తిని ఇంటికి తీసుకు వెళ్లలేక అవసరానికి డబ్బులు దొరకక పడుతున్న ఇబ్బందులు దళారులకు పండగగా మారింది. సీసీఐ కంటే తక్కువ ధరకు కొనుగో లు చేసి నిల్వ చేస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరస్థితి నెలకొంది. క్వింటాలు పత్తికి సుమారు రూ. వెయ్యి రూపా యలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

● జిల్లాలో 3.30 లక్షల ఎకరాల్లో..

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 3.30 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేయగా 23 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. జిల్లాలోని 17 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేయడానికి సీసీఐ అధికారులు ఏర్పాట్లు చేయగా మద్దతు ధరను కూడా నిర్ణయించారు. కానీ సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు చేయాలంటే రైల్‌టెల్ నెట్‌వర్క్ ఉండాల్సి ఉంటుంది. సాంకేతిక లోపంతో గత వారం రోజుల నుంచి నెట్‌వర్క్ పని చేయక పోవడంతో జిన్నింగ్ మిల్లులలో పత్తి కొనుగోళ్ల నిలిపివేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పు డెప్పుడు నెట్‌వర్స్ వస్తుందో ఎప్పుడు పత్తి కొనుగోలు చేస్తారని రైతులు తమ పంటను వాహనాల్లో తీసుకు వచ్చి జిన్నింగ్ మిల్లుల వద్ద వారం రోజుల నుంచి ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పెట్టుబడి భారంగా మారిన సమ యంలో ప్రస్తుతం రోజు రోజుకు వాహనాల అద్దె పెరుగుతూ మరింత ఇబ్బందిగా మారిం దని రైతులు చెబుతున్నారు.

నేడు శివాజీ విగ్రహావిష్కరణ

వాంకిడి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన శివాజీ విగ్రహాన్ని బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఆవిష్కరించనున్నట్లు ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహం ఆవిష్కరణకు ముందు ప్రత్యేక పూజలు, ర్యాలీ కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. మండలంలోని ఆరె కులస్తులతో పాటు అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

బదిలీపై వెళుతున్న జీఎంకు సన్మానం

రెబ్బెన, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా పని చేసిన శ్రీనివాస్ శ్రీరాంపూర్‌కు బదిలీపై వెళుతున్న సందర్భంగా మంగళవారం సిబ్బంది ఆయనకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం కె.రాజమల్లు, పీఓ ఎం.నరేందర్, ఏరియా ఇంజనీర్ రామనాథం, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 3 గంటల వరకు మండల కేంద్రంలోని సింగరేణి కాలనీలో, మైనార్టీ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని కెరమెరి, సాకడ గ్రామాల్లో మంగళవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆయా గ్రామాల్లో తాగునీటి వనులలో సమస్య తలెత్తకుండా సంబంధిత శాఖాధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సాకడ గ్రామంలో గ్రామస్థులను తాగునీటి వనరులపై అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ ద్వారా నీరు సక్రమంగా గ్రామానికి వస్తుందా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కెరమెరి మండల కేంద్రంలో నిర్మిస్తున్న సీహెచ్‌సీ నిర్మాణ పనులను పరిశీలించారు. రూ.3 లక్షల నిధులతో పనులు చేపడుతున్నా మన్నారు. అందులో రూ.2.10 లక్షలు ప్రభుత్వ నిధులు, రూ.90 వేలు గ్రామ పంచాయతీ నిధులతో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పనులను నాణ్యతగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చేపడుతున్న ఇందిరమ్మ నమూనా ఇంటిని పరిశీలించారు. ఆయన వెంట డీపీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మతీన్ అహ్మద్, ఏఈ విశ్వేశ్వర్, తదితరులు ఉన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.దుబ్బగూడలో మంగళవారం ఆయన పర్యటించారు. మిషన భగీరథ నీటి నాణ్యత, తాగునీటి కోసం తీసుకోవాల్సిన చర్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిం టికీ మిషన్ భగీరథ నీళ్ల సరఫరా చేయాలన్నారు. ఆనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనంలో నాణ్యత, తాగునీరు సౌకర్యం పరిశీలించారు. విద్యార్థులకు పోషకాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోహన్, ఏఈ రంజిత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధంలో తీసుకోవల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్ వడ్లూరి రాజేష్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో సమయ నిర్వాహణ, లక్ష్యాన్ని సాధించడం జీవశాస్త్రంలో మెళకువలు ఎలా తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో గుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత, ఉపాధ్యాయులు, నర్సింహమూర్తి, మల్లేష్, వినయ్‌కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుందిళ్ల రమేశ్ అన్నారు. మంగళవారం సిర్పూర్(టి) మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ ఏ విధంగా వాడాలి సెల్‌ఫోన్ వల్ల లాభ నష్టాలను వివరించారు. మంచి మార్కులు సాధించేందుకు మెళకువలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నాగసుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



పెంచికలపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

పెంచికలపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. పెంచికలపేట మండలం చెడ్వాయి గ్రామంలో పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి విద్యావేత్త నరేందర్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా మంగళవారం ఎమ్మెల్సీ దండె విటల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో వరుస క్రమంలో 2వ నెంబరు నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేయాలని పట్టభద్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రమౌళి, నాయకులు కృష్ణ, శ్రీనివాస్, శంకర్‌గౌడ్, రాజన్న, వెంకటేష్, సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదేశాల మేరకు మంగళవారం కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నరేందర్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని ఆదరించాలి



ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలు చూపుతున్న బీజేపీ నాయకులు

పెంచికలపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని ఆదరించాలని ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ అన్నారు. మండలంలోని ఎల్లూరు గ్రామంలో మంగళవారం ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు బీజేపీ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని ఆయన అన్నారు. బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపుకు అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పాల్వాయి అభిమానులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్‌సారంగపల్లి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల నియోజక వర్గ ఇన్‌చార్జి ఏమాజీ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రారి, వసివుల్లాఖాన్, సంతోష్, దిగంబర్, బాలకృష్ణ, దిలీప్, మోహన్, తిరుపతి, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ కోరారు. మంగళవారం దహెగాం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీజేపీ అధికారం చేపడుతుందన్నారు. పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి అంజిరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట నాయకులు వీరభద్రచారి, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ సర్వే నిర్వహించాలి

పెంచికలపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా జాయింట్ సర్వే నిర్వహించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో రైతుల భూములను అటవీ శాఖాధికారులు స్వాధీన పర్చుకునే ప్రయత్నం చేస్తున్నారని గ్రామ రైతులు ఎమ్మెల్సీ దండె విఠల్‌కు సమస్యను వివరించారు. దీంతో ఆయన మంగళవారం సమస్యాత్మక భూములను పరిశీలించారు. ఈ విషయమై అటవీ అధికారులతో మాట్లాడి రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. అటవీ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించే వరకు రైతుల జోలికి వెళ్లకూడదని అన్నారు. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి కేంద్ర అటవీ శాఖ మంత్రిని కలిసి సమస్యను వివరిస్తానని కొండపల్లి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు కృష్ణ, రాజన్న, సుధాకర్, చంద్రమౌళి, శంకర్‌గౌడ్, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

కౌటాల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటి, వీరవెల్లి, పార్డి, సాండ్‌గాం పాఠశాలలను మంగళవారం ఎంఈవో హనుమంతు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయా పాఠశాలల్లో ని ఉపాధ్యాయులను ఎంఈవో అభినందించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులకు అప్పగింత

జైపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీ రైల్వే ట్రాక్ కింద ఉన్న ఇనుప ప్లేట్లను దొంగతనం చేస్తున్న వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించామని ఎస్టీపీపీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం 19/2 రైల్వే ట్రాక్ ఏరియాలో రైల్వే ట్రాక్ కింద ఉన్న ప్లేట్లను దొంగతనం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్‌అండ్‌పీసీ సిబ్బం ది, గ్రామయువకులు పట్టుకున్నారు. అందులో నుంచి ఒకరు పారిపోగా శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన కొట్టె ప్రవీణ్ అనే దొంగను పట్టుకుని జైపూర్ పోలీసులకు అప్పగించామన్నారు. వారి వద్ద ఉన్న సుమారు 80 కిలోల ఇనుప సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మిట్ట మధ్యాహ్నం మద్యం సేవించి తీవ్రమైన ఎండలో నడి రోడ్డుపై ఓ వ్యక్తి పడి ఉండడాన్ని ఆసిఫాబాద్ పట్టణ ఎస్సై ప్రశాంత్ గమనించారు. వెంటనే కానిస్టేబుళ్లు ప్రేంసింగ్, సందీప్, మహేందర్‌ల సాయంతో అతడిని నీడలో కూర్చోబెట్టి డీహైడ్రేషన్ కాకుండా మంచినీరు తాగించి మానవత్వం చాటుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ ఎండలను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా చలివేం ద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్సైతో పాటు కానిస్టేబుళ్లను సీఐ రవీందర్‌తో పా టు పలువురు అభినందించారు.

ఇసుక డంప్ పట్టివేత

తంగళ్లపల్లి, (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని కస్బేకట్కూర్ శివారులో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంప్‌లను మంగళవారం పోలీస్, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక డంప్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈఎస్ఐ ఆస్పత్రిని తరలిస్తే ఊరుకోం



ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి తరలిస్తే ఊరుకునేది లేదని పలు కార్మిక సంఘాల నాయకులు అన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ప్రస్తుతం సేవలు అందడం లేదన్న అన్న సాకుతో ఈఎస్ఐ ఆస్పత్రిని తరలిస్తే అడ్డుకుంటామని అన్నారు. అధికారులు, నాయకులు వెంటనే స్పందించి ఈఎస్ఐ ఆసుపత్రి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. కలికోట రమణయ్య, షబ్బీర్ హుస్సేన్, వెంకటేష్, రా జన్న, అంబాల ఓదెలు, గోగర్ల కన్నయ్య, గోలెం వెంకటేష్, రాములు, రాజేష్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎంలో వెంటనే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ సిర్పూరు పేపర్ మిల్లు ఎంప్లాయిస్ యూనియ్ అధ్యక్షులు కొంగ సత్యనారాయణ అన్నారు. పేపర్ మిల్లు గుర్తింపు కార్మిక సంఘాల ముఖ్య నాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహణలో జాప్యం సరికాదని చెప్పారు. ఈ విషయంలో ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మురళి, వెంకటేష్, అన్నం రాజన్న, కలికోట రమణయ్య, అంబాల ఓదెలు, గోగర్ల కన్నయ్య, గోలేం వెంకటేష్, గోగర్ల రాములు, షబ్బీర్ హుస్సేన్, పిర్సింగుల శ్రీనివాస్, గోగర్ల శ్యాంరావు, చిట్టవేణి రాజేష్, యాదవ్, బండి శ్రీనివాస్, జాడి ఆశోక్, లింగంపల్లి శ్రీనివాస్, సారంగపాణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కౌటాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కౌటాల మండల కేంద్రంలని జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు శ్రీకాంత్, శిరీష, కావేరి, మనస్వి, కీర్తన ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నారాయణసింగ్, వ్యాయమ ఉపాధ్యాయుడు హరికృష్ణ తెలిపారు. వికారాబాద్‌లో 20 నుంచి నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి

వాంకిడి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక బుద్ధ విహార్‌లో మంగళవారం బీఎస్ఐ నాయకులు భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్‌కార్ అశోక్ మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా కుల నిర్మూలన కార్యక్రమాలను నిర్వహిస్తూ అనగారిన ప్రజల్లో ధైర్యాన్ని నింపారన్నారు. కుల వివక్షను దృష్టిలో పెట్టుకొని అయన బుద్ధ పూర్ణిమ రోజు బౌద్ధ మతం స్వీకరించారని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో బౌద్ధ సమాజ్ అధ్యక్షుడు విలాస్, నాయకులు మనోజ్, యశ్పాల్, కిరణ్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, పాల్గొన్నారు.